ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

- మావోయిస్టులతో కేంద్రం శాంతిచర్చలు జరపాలి
- దోపిడీ వర్గాలకు అడ్డంగా ఉన్నందుకే వారిపై అణచివేత
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- ప్రశ్నించేవారిని భయపెట్టడమే మోడీ సర్కారు లక్ష్యం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దోపిడీ వర్గాలకు మావోయిస్టులు అడ్డంగా ఉన్నారనీ, అందుకే కేంద్ర ప్రభుత్వం వారిపై అణచివేత చర్యలకు పూనుకున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో పోలీసు క్యాంపులు ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపేయాలనీ, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యం మీదకు 25 వేల మంది భద్రతాబలగాన్ని పంపడం అవసరమా? అని ప్రశ్నించారు. అక్కడ ఆదివాసీ మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయనీ, పురుషులను చిత్రహింసలకు గురిచేస్తున్నారనే వార్తలు వస్తున్నాయని వాపోయారు. ఇలాంటి దుర్మార్గమైన హింసను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దండకారణ్యంలోని కర్రెగుట్టలు మన దేశంలో లేవా? అక్కడ ఏం విముక్తి చేశారు? అక్కడెక్కి విజయం సాధించినట్టు జాతీయ జెండా పాతడమేంటి? అని ప్రశ్నించారు. మోడీ సర్కారు చేపట్టిన ఆపరేషన్ కగార్ వెనుక దండకారణ్యంలోని అపారమైన ఖనిజవనరులను, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. శాంతి చర్చల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు.

ఓంశాంతి అంటూనే మీరిచ్చే సందేశమేంటి? : చంద్రకుమార్

ఆర్‌ఎస్‌ఎస్ ఓంశాంతి జపం చేస్తూనే మరోవైపు తమకు వ్యతిరేకమైన భావజాల శక్తులు లేకుండా చేసే పనిలో ఉందని రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ ఎండగట్టారు. అది చెప్పేదాంట్లో చేసేదాంట్లో పూర్తి వైరుధ్యం ఉంటుందని విమర్శించారు. మావోయిస్టులు శాంతి చర్చల కోసం సంకేతాలు పంపుతుంటే మోడీ సర్కారు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. అసమానతలు లేని భారత సమాజాన్ని రూపొందించాలని రాజ్యాంగం చెబుతుంటే పాలకులు మాత్రం సంపద కొద్దిమంది కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లే చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. అందరికీ ఉచిత విద్య, వైద్యం అందించే లక్ష్యం నుంచి పాలకులు తప్పుకున్నారన్నారు. అదే సమయంలో ఆ రెండు రంగాలను కార్పొరేట్లకు అప్పగించారని విమర్శించారు. పేదల చేతుల్లో భూమి లేదు.. అటవీ ప్రాంతాల్లో పేసా యాక్టు అమలు కావడం లేదని ఎత్తిచూపారు. ఇవన్నింటినీ పాలకులు చేయడం లేదు కాబట్టే ప్రజల్లో అసంతృప్తి నెలకొందన్నారు. కొందరు పోరాటాల వైపు మళ్లారని చెప్పారు. మావోయిస్టుల పోరాటాన్ని సామాజిక పోరాటంగా చూడాలనీ, శాంతిభద్రతల సమస్యగా చూడొద్దని కేంద్రానికి హితవు పలికారు.

ప్రజాస్వామ్య దేశాన్ని నిరంకుశంగా మార్చే కుట్ర : కూనంనేని

రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతూ ప్రజాస్వామిక దేశాన్ని నిరంకుశంగా మార్చే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని కూనంనేని సాంబశివరావు విమర్శించారు. తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షించాలిగానీ మావోయిస్టులను తుడముట్టిస్తామని ప్రకటించే అధికారాన్ని, చంపించే హక్కును మోడీ, అమిత్‌షాలకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రశ్నించేవారిని భయపెట్టడం, వినకపోతే చంపడమే లక్ష్యంగా పెట్టుకుని మోడీ సర్కారు ముందుకెళ్తున్నదని విమర్శించారు. అధికారం ఎన్నటికీ శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యం శాశ్వతమని అన్నారు. దండకారణ్యంలో నరమేధాన్ని కేంద్రం ఆపాలనీ, ఇరుపక్షాలు కాల్పుల విరమణ ప్రకటించాలని కోరారు.

సాయుధ బలగాలను ప్రయోగించడం అవసరమా? : వేములపల్లి వెంకట్రామయ్య

దండకారణ్యంలో భారీ ఎత్తున సాయుధ బలగాలను ప్రయోగించడం అవసరమా? అని సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. ఆదివాసీలను ఎన్‌కౌంటర్ చేయడాన్నీ, చిత్రహింసలు పెట్టడాన్ని తప్పుబట్టారు. సాయుధబలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, క్యాంపులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సత్యం మాట్లాడుతూ.. ప్రజాస్వామిక దేశంలో ఇలాంటి దాడులు సరిగాదన్నారు. సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు రామచంద్రర్, ఎమ్‌సిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యుసిఐ(సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురహరి, అరుణోదయ నేత విమలక్క, ఫార్వర్డ్‌బ్లాక్ నేత విశ్వనాథం, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ (ఎంఎల్-లిబరేషన్) రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌రాజా, తదితరులు మాట్లాడుతూ.. ఆదివాసీలపై నిర్బంధం సరిగాదన్నారు. చంపడం, హత్యలు చేయడం ద్వారా ఎప్పటికీ శాంతి చేకూరదన్నారు.

అసెంబ్లీ స్పీకర్‌తో సిఎస్ భేటీ

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం బంజారాహిల్స్ ఎంఆర్‌సిలోని తన అధికార నివాసానికి విచ్చేసిన రామకృష్ణారావును స్పీకర్ శాలువా, పుష్ప గుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. తెలంగాణ లేజిస్లేచర్ సెక్రెటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు ఈ భేటీలో పాల్గొన్నారు.

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు ఆహ్వానం

- దరఖాస్తులకు చివరి తేదీ మే 17
- ఎంపికైన వారికి 50 రోజుల శిక్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గణితం సబ్జెక్టు ఉండి ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు, ఐటిఐ డ్రాఫ్ట్‌మెన్ (సివిల్), డిప్లొమా (సివిల్), బిటెక్ (సివిల్), ఇతర సమానమైన అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. దరఖాస్తు ఫారాలను మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామనీ, వంద రూపాయల ఫీజు చెల్లించి పొందొచ్చని సూచించింది. దరఖాస్తుల స్వీకరణకు తుది తేదీ మే 17 అని ప్రకటించింది. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో 50 పనిదినాల శిక్షణ ఉంటుందని పేర్కొంది. శిక్షణకు సంబంధించి ఒసి అభ్యర్థులకు రూ.10 వేలు, బిసి అభ్యర్థులకు రూ.5 వేలు, ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు రూ.2,500 చొప్పున ఫీజు ఉంటుందని తెలిపింది. పూర్తి వివరాల కోసం 98490 81489, 70326 34404, 94419 47339 నెంబర్లను సంప్రదించాలని సూచించింది.

చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఎగ్జిబిషను

- యూనిఫామ్స్ మెటీరియల్ కొనుగోళ్లు
- సహకార శాఖ బ్యాంక్ మరింత అభివృద్ధి చెందాలి
- నిలిచిన రైతు రుణమాఫీ నెల రోజుల్లోపు పూర్తి : మంత్రి తుమ్మల



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయిస్తామని, చేనేత వస్త్రాలు డూప్లికేట్‌ను నివారిస్తామని వ్యవసాయ, మార్కెటింగ్, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో తడక రమేష్ ఆధ్వర్యంలో కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, చేనేత సదస్సులో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. కేవలం వెయ్యి మంది ఖాతాదారులు, రూ.6.50 లక్షలతో ప్రారంభించిన సహకార బ్యాంకు నేడు రూ.400 కోట్లతో లక్ష మంది ఖాతాలతో అభివృద్ధి చెందడం ఐక్యతకు, అంకితభావానికి నిదర్శనమన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించొచ్చని నిరూపించారన్నారు. కొంగర భాస్కరరావు ఆశయాన్ని నిలబెట్టారన్నారు. భూదాన్ ఉద్యమానికి పేరొందిన పోచంపల్లి ప్రాంతంలో ధాన్యం కూడా ఎక్కువగా పండుతుందన్నారు. చేనేత రంగాలను ప్రోత్సహించేందుకు పొదుపు పథకం ద్వారా రూ.290 కోట్లు విడుదల చేశామన్నారు. రూ.75 వేల నుంచి రూ 1.50 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. చేనేత వస్త్రాలు డూప్లికేట్ రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ద్వారా యూనిఫామ్స్ మెటీరియల్స్ కొనుగోలు చేయిస్తామని చెప్పారు. ఐఐహెచ్‌టిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సాంకేతికంగా నిలిచిపోయిన రైతుల రైతు రుణమాఫీ నెల రోజుల్లోపు అందుతుందని తెలిపారు. భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీగా ఏర్పడటం, యునెస్కో వారిచే హెరిటేజ్ గ్రామంగా గుర్తింపు తెచ్చుకోవడం సంతోకరమన్నారు.

రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. పొదుపు పథకాలన్నీ అమల్లోకి తెస్తామన్నారు. ఆర్డీలు కట్టిస్తామన్నారు. ప్రతి చేనేత కార్మికుడికీ రూ.18 వేలు, అనుబంధ కార్మికుడికి 6 వేలు జమ చేసే పద్ధతి వచ్చే నెల నుంచి అమల్లోకి వస్తుందన్నారు. చేనేత వస్త్రాలైన బెడ్‌షీట్లు, టవల్స్, లుంగీలు మార్కెటింగ్ చేసేందుకు ప్రోత్సాహకంగా షోరూమ్‌లను ఏర్పాటుచేసి విక్రయానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. టెక్స్‌టైల్స్ డిప్లొమా కోర్సులో 60 మంది అభ్యసిస్తున్నారని తెలిపారు. గతంలో 57 ఏళ్ల వారికే బీమా వర్తించేదని, ప్రస్తుత ప్రభుత్వం వయసుతో నిమిత్తం లేకుండా వృద్ధులకు కూడా ఐదు లక్షల బీమా వర్తింపజేస్తుందని తెలిపారు. బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, బ్యాంకు సిఇఒ సీత శ్రీనివాస్ మాట్లాడుతూ.. పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంకు అంచలంచెలుగా ఎదుగుతూ మెరుగైన సేవలు అందించడం పట్ల అనేక అవార్డులను సాధించిందని తెలిపారు.

పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సొంత సంస్థగా నడిపించినప్పుడే సహకార సంఘాలు బలపడతాయన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. చేనేత సంఘాలన్నీ కలిసి ఐక్యంగా నిలబడటం అభివృద్ధికి చిహ్నం అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ పేరిట నెలకొల్పిన అవార్డ్స్ కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తడక వెంకటేశం, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు మురళి మదన్‌గోపాల్ స్వామి, భువనగిరి మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, ఆర్‌డిఒ శేఖర్ రెడ్డి, నాయకులు గర్దాస్ బాలయ్య, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ప్రమాదంలో రాజ్యాంగం, న్యాయవ్యవస్థలు

- విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థలు ప్రమాదంలో ఉన్నాయనీ, వాటి విశ్వసనీయతను దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'గవర్నర్ల పాత్ర-న్యాయస్థానాలు- భారత రాజ్యాంగం' అంశంపై సదస్సు జరిగింది. దీనికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీ సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గవర్నర్ల వ్యవస్థను తెలుగుదేశం పార్టీతో పాటు ద్రవిడ రాజకీయపార్టీలన్నీ వ్యతిరేకించాయని తెలిపారు. చట్టసభలు చట్టాలు చేస్తే, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్, శాసనమండలి చైర్మెన్లు అమోదిస్తే సరిపోతుందనీ, దానికోసం గవర్నర్ల వ్యవస్థ ఎందుకనేది వారి ప్రశ్న అని చెప్పారు. అయితే చట్టసభలు రాజ్యాంగానికి లోబడే చట్టాలు చేయాలనీ, దానిలో ఏదైనా లోపాలు ఉంటే న్యాయవ్యవస్థ జోక్యం చేసుకొని, సరిచేయడం లేదా తిరస్కరించడం చేస్తుందని వివరించారు. ఎస్ఆర్ బొమ్మై కేసులో ఇదే జరిగిందని గుర్తుచేశారు. అన్ని వ్యవస్థలకు రాజ్యాంగమే సుప్రీం అనీ, అయితే రాజ్యాంగంలో న్యాయసమీక్షకు ప్రత్యేకంగా ఎలాంటి వ్యవస్థ లేదని చెప్పారు. న్యాయస్థానాలు స్వీయ హద్దులు నిర్ణయించుకొని ఆ బాధ్యతల్ని నిర్వహిస్తున్నాయని వివరించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలను ఇబ్బందిపెట్టడమే గవర్నర్ల వ్యవస్థ లక్ష్యంగా మారిందనే విమర్శలు పెరుగుతున్నాయంటూ తమిళనాడు ఉదంతాన్ని ప్రస్తావించారు. రాజ్యాంగ న్యాయసమీక్షపై సర్కారియా కమిషన్ లోతైన అధ్యయనం చేసిందని చెప్పారు. కేంద్రంలో అధికారపార్టీ సభ్యుడు ఒకరు సుప్రీంకోర్టుకువెళ్లి ఫలానా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారనీ, ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తాయని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 32 ప్రాథమిక హక్కును గుర్తిస్తుందనీ, ఇప్పుడు దీనిపైనే దాడి జరుగుతున్నదన్నారు. అన్ని వ్యవస్థలకు రాజ్యాంగమే సుప్రీం అనీ, దాన్ని పలుచన చేసే చర్యలు ఆందోళన కలిగిస్తాయని చెప్పారు.

ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్నవారు సుప్రీంకోర్టును శత్రుపక్షంగా చూస్తున్నారని విమర్శించారు. ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ సుప్రీం తీర్పులపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, దాన్ని విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సభ్యుడు ఒకరు పహల్గాం ఉగ్రదాడికి సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి, న్యాయవ్యవస్థపై దాడి చేస్తున్నారని ఉదహరించారు. దేశంలో తటస్థంగా వ్యవహరిస్తున్న వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు కొన్ని రాజకీయశక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే నాలుగో స్తంభం అని చెప్పబడే మీడియాను నయానో, భయానో తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారనీ, ఇప్పుడు వారి దృష్టి రాజ్యాంగం, న్యాయవ్యవస్థలపై ఉన్నదని వివరించారు. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల అనర్హత అంశాలు స్పీకర్ పరిధిలో ఉన్నా, దానికి నిర్ణీత గడువు లేదనీ, దాన్ని న్యాయవ్యవస్థ నిర్ణయిస్తే భరించలేని స్థితి ఉన్నదని చెప్పారు. రాజ్యాంగం మౌలిక స్వరూపం మార్చే ఉద్దేశ్యం అధికారంలో ఉన్నవారికి ఉన్నదనీ, దానికోసం ఆయా వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయిస్తున్నారని స్పష్టం చేశారు. సదస్సుకు తెలంగాణ హైకోర్టు సీనియర్ అడ్వకేట్ జీ విద్యాసాగర్ అధ్యక్షత వహించారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్త

తన గుత్తాధిపత్యానికే ట్రంప్ శాంతి మాటలు

- ఆయన విధానాలు కార్పొరేట్లకు మాత్రమే అనుకూలం
- యుటిఎఫ్ నేత రామిరెడ్డి స్మారకోపన్యాసంలో ప్రొ కె నాగేశ్వర్
- రామిరెడ్డి జీవితం ఆదర్శనీయం : అలుగుబెల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తన గుత్తాధిపత్యాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకే అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచశాంతి ప్రవచనల్ని చెబుతున్నారనిమాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్ వ్యాఖ్యానించారు. ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్లకే ఉపయోగపడతాయే తప్ప ప్రపంచశాంతికి తోడ్పడవని ఆయన తేల్చి చెప్పారు. ఉపాధ్యాయ ఉద్యమ జాతీయ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఉద్యమ నిర్మాణంలో ప్రముఖులు, యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "ట్రంప్ సృష్టిస్తున్న నూతన ప్రపంచం ఎలా ఉండనుంది..?" అనే అంశంపై నాగేశ్వర్ స్మారకోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ రామిరెడ్డి గొప్ప మానవతావాది అనీ, ఆదర్శ ఎమ్మెల్సీ అని కొనియాడారు. ఆయనతో కలిసి పని చేసిన అనుభవం మరువలేనిదని గుర్తు చేసుకున్నారు.



స్మారకోపన్యాసంలో చేస్తున్న ప్రొ కె నాగేశ్వర్

అనంతరం ట్రంప్ విధానాలపై నాగేశ్వర్ మాట్లాడుతూ రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం సందర్భంగా రష్యా ఏకాకి అవుతుందంటూ అమెరికా చేసిన అంచనా తప్పిందని అన్నారు. రూబుల్ విలువ పడిపోతుందని, రష్యాలో ప్రభుత్వ వ్యతిరేకత వెల్లువెత్తుతుందనేది వాస్తవంలో తేలిపోయిందని వివరించారు. ఉక్రెయిన్‌ను సగానికిపైగా రష్యా ఆక్రమించడంతో ట్రంప్, యుద్ధం విరమించాలనీ, శాంతిని ప్రేమించాలంటూ కొత్త నినాదాన్ని ముందుకు తెచ్చారని తెలిపారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ఇంకా కొనసాగితే రష్యా-చైనాకు మరింత దగ్గరవుతుందని భావనతోనే ఆయన యుద్ధం ఆపాలని కోరుతున్నారే తప్ప శాంతి కోసం కాదని వివరించారు. చైనాను ఆర్థికంగా దెబ్బ తీసేందుకు ట్రంప్ రష్యాకు దగ్గరవుతున్నారనే తప్ప శాంతి కోసం కాదని అభిప్రాయపడ్డారు. ట్రంప్ చర్యలన్నీ కేవలం అమెరికాను అగ్రరాజ్యంగా కొనసాగించేందుకే తోడ్పతున్నాయని తెలిపారు.

ట్రంప్ అధికారంలోకి వచ్చాక ప్రపంచ దేశాలపై సుంకాల పేరుతో పెద్ద ఎత్తున దోచుకెళ్లడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఆ రకంగా ప్రపంచ దేశాలన్నింటినీ తన గుప్పిట్లో పెట్టుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారని వివరించారు. అమెరికాలో ఉన్న కొంత మంది పెట్టుబడిదారులతో ఏకమై అగ్రరాజ్య ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. నేటి ప్రపంచ ఆర్థిక విధానం డాలర్‌తో మాత్రమే ముడిపడి ఉందన్నారు. భవిష్యత్తులో ట్రంప్ విధానాలు ఇదేవిధంగా కొనసాగితే డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరొక కరెన్సీ ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని దేశాలు కలిసి అమెరికాకు ప్రత్యామ్నాయంగా కూటములుగా ఏర్పడే అవకాశం ఉందని వివరించారు.

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ రామిరెడ్డి జీవితం ఎంతో ఆదర్శప్రాయమైందని చెప్పారు. ఆయన ప్రతీ అంశంపై సాధికారత సాధించాలనే స్ఫూర్తినిచ్చిన నాయకుడు అని కొనియాడారు.. అవసరమైన సందర్భంలో పని చిన్నదా? పెద్దదా ? అని కాకుండా, చేయడానికి సిద్ధపడాలనే తపన కలిగిన నాయకుడు అని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, జాతీయస్థాయిలో ఎస్టీఎఫ్ఐని ఏర్పాటు చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని చెప్పారు. రామిరెడ్డి స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు అంకితం కావాలని పిలుపునిచ్చారు.

మాజీ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాచూరి అమరత్వాన్ని ఆవిష్కరిస్తూ, ఆయన దారెంట నడుస్తూ, ఆయన ఆశయ సాధనకు అంకితం అవుదామని పిలుపునిచ్చారు. "మరణం విలువైన జీవితానికి గుర్తింపు" అది రామిరెడ్డి పని తీరులో ఇప్పటికీ ప్రస్ఫుటం అవుతుంది కొనియాడారు.

ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సంయుక్త మాట్లాడుతూ . రామిరెడ్డి మానవీయ సంబంధాలను ఎలా కలిగి ఉండాలో నేర్పిన ఉపాధ్యాయుడుని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం నరహరి, టిపిఆర్ఎ రాష్ట్ర అధ్యక్షులు పి కృష్ణమూర్తి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్, ఉపాధ్యక్షులు కె జంగయ్య, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, వాయిస్ ఆఫ్ తెలంగాణ టీచర్ పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు, ఆయా జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విడిసి నుంచి గంగపుత్ర సంఘం బహిష్కరణ

- శిలాఫలకంపై పేర్ల ఏర్పాటును ప్రశ్నించినందుకు కోటార్మూర్ విడిసి పెద్దల తీర్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకవైపు విడిసి ఆగడాలపై పెద్దఎత్తున ఆందోళనలు కొనసాగుతుంటే.. మరోవైపు వాటి ఆకృత్యాలు ఏమాత్రం ఆగడం లేదు. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గౌడ సామాజిక తరగతి బహిష్కరణ ఘటనను మరువకముందే ఆర్మూర్ డివిజన్‌లో మరో ఘటన జరిగింది. శిలాఫలకంపై పేర్ల విషయంలో ప్రశ్నించినందుకు ఏకంగా విడిసి నుంచి గంగపుత్ర సంఘాన్ని బహిష్కరించారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకెళ్తే.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గతేడాది నిర్మించిన హనుమాన్ ఆలయానికి భూమి ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకంపై ఏర్పాటు చేశారు. గత విడిసి సభ్యులు ఈ దాతల పేర్లు పెట్టలేదని, ప్రస్తుత విడిసి సభ్యులు ఎలాంటి చర్చా లేకుండానే వారి పేర్లు ఏ విధంగా ఏర్పాటు చేశారని గంగపుత్ర సంఘం సభ్యుడు ప్రశ్నించాడు. అదే విషయాన్ని వాట్సప్ గ్రూపులోనూ పెట్టాడు. పేర్లు పెట్టడంపై గంగపుత్ర సంఘం సభ్యులతోపాటు కొందరు ఇతర సామాజిక తరగతుల సభ్యులు కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. దాంతో వారిని విడిసి పెద్దలు సమావేశానికి పిలిపించారు. ప్రశ్నించిన మిగతా కులాల వారిని వదిలేసి.. కేవలం గంగపుత్ర సంఘం సభ్యునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగపుత్ర సంఘానికి రూ.12 వేలు జరిమానా విధించారు. దీనిపై గంగపుత్ర సంఘం సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అందరితోపాటు తమను శిక్షించాలి తప్పా.. ఒక్క సంఘానికి జరిమానా విధించడం సమంజసం కాదన్నారు. విడిసి పెద్దలు విధించిన జరిమానా చెల్లించబోమని స్పష్టం చేశారు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ సమావేశమై 32 కుటుంబాలు ఉన్న గంగపుత్ర సంఘాన్ని విడిసి నుంచి బహిష్కరించారు.

కోటార్మూర్‌లోని చెరువు నీరు ఖాళీ చేసే విషయంలో అభ్యంతరం వ్యక్తం చేసినందుకుగానూ నాలుగైదు నెలల కిందట గంగపుత్ర సంఘానికి రూ.17 వేలు జరిమానా విధించారు. గ్రామ విడిసిలోకి గంగపుత్ర సంఘం సభ్యులను కొన్ని రోజుల నుంచి రానివ్వకపోవడం పట్ల సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అథ్లెట్ల కోసం తొలి బ్రెయిన్ ట్రైనింగ్ ల్యాబ్

- వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీ, సిక్స్ ఎస్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో..

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రపంచ స్థాయి విద్యతో పాటు అత్యుత్తమ క్రీడా శిక్షణ అందించే దిశగా తొలి స్పోర్ట్స్ బ్రెయిన్ ట్రైనింగ్ ల్యాబ్ ప్రారంభించినట్లు వోక్సెన్ స్పోర్ట్స్ అకాడమీ, సిక్స్ ఎస్ స్పోర్ట్స్ ప్రకటించాయి. ఇందుకోసం ఇరు సంస్థలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు గురువారం హైదరాబాద్‌లో ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ బ్యాడ్మింటన్ పుల్లెల్ల గోపీచంద్, క్రికెటర్ ఎమ్మెస్కే ప్రసాద్, వరల్డ్ అథ్లెటిక్స్ అంజు బాబీ జార్జ్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వోక్సెన్ యూనివర్శిటీ వైస్ ప్రెసిడెంట్ రౌల్ రోడ్రిగ్జ్, సిక్స్ ఎస్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఆంటోనీ చాకో, స్పోర్ట్స్ మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్ గ్లోబల్ సిఇఒ అనిల్ నాయర్ తదితరులు పాల్గొన్నారు. అథ్లెట్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విద్యాసంస్థలు, క్రీడలను అనుసంధానించాల్సిన అవసరం ఉందని రౌల్ రోడ్రిగ్జ్ అభిప్రాయపడ్డారు. క్రీడలకు అతీతంగా కెరీర్ మార్గాలను నిర్మించడానికి వోక్సెన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని చెప్పారు. మనదేశంలోని అథ్లెట్ల నిర్మాణాత్మక పరివర్తనకు ఉన్న ప్రాముఖ్యతను ఆంటోనీ చాకో తెలియజేశారు. అథ్లెట్లకు స్టోరీ టెల్లింగ్, మీడియా లిటరసీ, వ్యవస్థాపక ఆలోచనలను బోధించడం అవసరమని అనిల్ నాయర్ తెలిపారు. క్రీడా జీవితంలో తనకు ఎదురైన అనుభవాలను అంజు బాబీ జార్జ్ పంచుకున్నారు.

ఎన్‌డిఎస్ఎ రిపోర్టు అమలుకు సర్కారు 'సై'

- అధ్యయనం, చర్యల కోసం అధికారులతో కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల కుంగుబాటుపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డిఎస్ఎ) నివేదిక అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక చర్యలు చేపట్టింది. ఆ రిపోర్టును అధ్యయనం చేసి చర్యలను సూచించేందుకు ఐదుగురు సీనియర్ నీటిపారుదల అధికారులతో ప్రత్యేక కమిటీని సర్కారు ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఇఎన్‌సి జనరల్, ఇఎన్‌సి (ఓ అండ్ ఎం), రామగుండం చీఫ్ ఇంజనీర్ (ఇరిగేషన్), సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్లకు బాధ్యతలను అప్పగించింది. వీరంతా ఎన్‌డిఎస్ఎ నివేదికను క్షుణ్ణంగా చదవాలి. అంతేగాక కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రక్షణ కోసం అవసరమైన చర్యలను ప్రతిపాదించాలి. ఇకపోతే స్థానిక ప్రజలతోపాటు ప్రాజెక్టుపై ఆధారపడ్డవారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలనూ ప్రభుత్వానికి సూచించాలి. అధ్యయనం అనంతరం చర్యలకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి ఇఎన్‌సి జనరల్ జి అనిల్‌కుమార్ పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు.

నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ స్కీం రద్దు చేయాలి

- మే 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం
- ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల హక్కులను సాధించుకుందాం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ స్కీం రద్దు కోసం పోరాడాలి.. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మికుల హక్కులను సాధించుకుందాం.. మే 20న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం.." అని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి అమల్లోకి తీసుకొస్తోందన్నారు. కార్మిక చట్టపరమైన కనీస హక్కులను హరించే ఈ నాలుగు లేబర్ కోడ్లతో కార్మికులు హక్కులు కోల్పోవడంతోపాటు ట్రేడ్ యూనియన్లు లేకుండా చేసే కుట్ర దాగి ఉందని చెప్పారు. జీతాల పెంపుదలకు బేరసారాల హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ రద్దుకు రిజిస్ట్రర్‌లకు విస్తృత అధికారాలు కల్పించబడతాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా నిర్వహిస్తున్న తనిఖీ వ్యవస్థను తొలగిస్తారన్నారు. కొత్త ట్రేడ్ యూనియన్ల నమోదు ప్రక్రియపై తీవ్ర ఆంక్షలు విధించబడతాయన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధుల కేటాయింపు పెంచాలని, ఈ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని డిమాండ్ చేశారు. నేషనల్ మానిటైజేషన్ పైప్ లైన్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలు, వ్యూహాత్మక అమ్మకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ వంటి చర్యలతో ప్రభుత్వరంగ సంస్థలు బలహీన పడుతున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ వివరించారు. ప్రభుత్వ రంగాన్ని ఆధారం చేసుకుని విదేశీ, స్వదేశీ బహుళ జాతి సంస్థలు లక్షల కోట్ల రూపాయల లాభాలను ఆర్జిస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగం అంటే కేవలం ఆయా సంస్థల్లో పని చేసే కార్మికుల ప్రయోజనాలు మాత్రమే కాదని, ప్రభుత్వ రంగం దేశం మౌలిక సదుపాయాల కల్పనకు దోహదం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రజల సొమ్ముకు భద్రత లభిస్తుందని, ఆర్థిక వ్యవస్థకు అండగా నిలుస్తుందని తెలిపారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ విధానంతో ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు -2022ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలన్నారు.

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను బలహీన పరుస్తోందన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ వంటి చర్యలతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడానికి పూనుకుంటుందన్నారు. మేజర్ పోర్టు చట్టాన్ని ఆమోదించి బీమా కంపెనీలలో ఎఫ్‌డిఐలను వంద శాతానికి పెంచిందని, 41 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏడు కంపెనీలుగా మార్చి రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించిందన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్‌రాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ట్రేడ్ యూనియన్ ఉద్యమాలపై దాడి చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, ధనవంతులు, కార్పొరేట్ వర్గాల ఆదాయంపై సంపద ట్యాక్స్ పెంచి.. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల కు కేటాయించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విడిఎ నిర్ణయించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ స్కీంను ప్రవేశపెట్టాల న్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ ధర్మానాయక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శోభన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మ, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన ఆన్‌లైన్ జూదం



హైదరాబాద్ : తెలంగాణలో గడిచిన ఐదేళ్లలో భారీగా ఆన్‌లైన్ జూదం పెరిగిందని ప్రహార్ తెలిపింది. వివిధ ప్రజా అంశాలపై స్పందించే ఎన్‌జిఒ ప్రహార్.. తాజాగా ఆన్‌లైన్ జూదం, బెట్టింగ్‌లపై ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై 2500 మంది అభిప్రాయాలను సేకరించినట్లు పేర్కొంది. తెలంగాణలో 2017 నుంచే ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించినప్పటికీ.. పలు మార్గాల్లో మొబైల్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ కొనసాగుతూనే ఉందని ప్రహార్ అధ్యక్షుడు అభయ్ రాజ్ మిశ్రా పేర్కొన్నారు. ఆన్‌లైన్ జూదంతో ముడిపడి ఉన్న సైబర్ నేరాలు రాష్ట్రంలో 2020 నుంచి 2025 మధ్య 800 శాతం పైగా పెరిగాయన్నారు. మనీలాండరింగ్, యువత ఆత్మహత్యలు, సెలబ్రిటీల ప్రచారంతో నడుస్తోన్న బెట్టింగ్ యాప్‌లు సవాళ్లుగా నిలుస్తోన్నాయన్నారు.

వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డులివ్వాలి

- పెన్షన్ రూ.6 వేలకు పెంచాలి : ఎం అడివయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి వికలాంగునికీ అంత్యోదయ రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అడివయ్య ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట 24 గంటల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అడిషనల్ కలెక్టర్ సమయంలో చర్చలు

ధర్నా సందర్భంగా ఎన్‌పిఆర్‌డి ప్రతినిధులతో జిల్లా అధికారులు అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్, డిడబ్ల్యూఒ హైమావతి సమక్షంలో చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ధర్నా శిబిరం దగ్గరకు డిడబ్ల్యూఒ హైమావతి వచ్చి చర్చల వివరాలు వివరించారు.

సమస్యలు పరిష్కారం చేస్తాం : అడిషనల్ కలెక్టర్ హామీ

వికలాంగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ హామీ ఇచ్చారు. వికలాంగులకు కల్పించాల్సిన సౌకర్యాలపై డిపార్ట్‌మెంట్ వారికి లేఖలు పంపించామని, వారి నుంచి సమాధానం రాగానే జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి మెదక్ జిల్లా అధ్యక్షులు ముత్యాలు, కార్యదర్శి కె.యశోద, జిల్లా ఉపాధ్యక్షులు టి.యాదగిరి, కవిత, కిష్టయ్య, శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు శ్రీనివాస్, దుర్గ, సామెందర్, కిష్టయ్య, మెదక్ పట్టణ కన్వీనర్ శ్రీదేవి, కో కన్వీనర్ మున్నా, వెంకట్, మునీర్, వికలాంగులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వికలాంగులు

ఘనంగా జిఎన్ఐటిఎస్ గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - హైదరాబాద్



జి నారాయణమ్మ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జిఎన్ఐటిఎస్) తన నాలుగో ఆటనమస్ బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే 2025ను ఘనంగా నిర్వహించుకున్నట్లు ప్రకటించింది. షేక్‌పేటలోని మహిళల క్యాంపస్లోని ఓపెన్ ఆడిటోరియంలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియా హెడ్ ఆఫ్ ఎంటర్‌ప్రైజ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ కడియాల, జిఎన్ఐటిఎస్ ఛైర్మన్ రాఘవ రెడ్డి, వైస్ ఛైర్మన్ విద్యా రెడ్డి, ప్రిన్సిపల్ కె రమేష్ రెడ్డి, డీన్లు, విద్యార్థులు హాజరయ్యారు. దీనికి 2021-2025 బిటెక్ బ్యాంక్, 2023-25 ఎంటెక్ బ్యాచ్‌కు చెందిన 1050 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని ఆ సంస్థ పేర్కొంది.



హైదరాబాద్‌కు జూలియా ఈవేలిన్ మోర్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాదులో జరగనున్న మిస్ వరల్డ్ 2025 పోటీల ఏర్పాట్లను సమీక్షించేందుకు లండన్‌లోని మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈవో, చైర్ పర్సన్ జూలియా ఈవేలిన్ మోర్లి శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్పోర్ట్‌కు చేరుకున్న జూలియా మోర్లీకి సాంప్రదాయపద్ధంగా ఘన స్వాగతం పలికారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణపై జరుగుతున్న ఏర్పాట్లు, మిస్ వరల్డ్ కాంటెండర్స్ పర్యటించే వివిధ ప్రాంతాలలో చేపట్టిన ఏర్పాటు, వివిధ ఈవెంట్లకు సంబంధించిన అంశాలపై జూలియా మోర్లి సంబంధిత ఏజెన్సీలు, వివిధ విభాగాలతో మోర్లి సమీక్షిస్తారు.

టియుఎంహెచ్ఇయు సమ్మె నోటీస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



దేశ వ్యాప్తంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) తెలిపింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియొద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదానాయక్ శుక్రవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూకు సమ్మె నోటీస్ అందజేశారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపులో భాగంగా ఈ సమ్మె జరుగుతున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి 2019, 2020 సంవత్సరాల్లో 4 లేబర్ కోడ్‌లను పార్లమెంటులో చట్టాలుగా చేసిందని చెప్పారు. ఈ లేబర్ కోడ్‌లు అమల్లోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్ లతో కార్మికుల ఎనిమిది గంటల పని దినం, పిఎఫ్, ఈఎస్ఐ, బోనస్, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, యూనియన్ పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కుల్లో అనేక మార్పులు వచ్చి కార్మిక హక్కులు హరించబడతాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, సిఐటియు, హెచ్ఎంఎస్, యుటియుసి తదితర సంఘాలతో పాటు రాష్ట్రంలో బిఆర్‌టియు, టియుసిఐ, ఐఎఫ్‌టియు, టిఎన్‌టియుసి లాంటి సంఘాలు ఈ ఏడాది మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయని వివరించారు. ఇందులో భాగంగా పారిశ్రామిక వివాదల చట్టం-1947లోని సెక్షన్ -22 సబ్ సక్షన్ (1) ని అనుసరించి సమ్మె నోటీస్ అందిస్తున్నట్టు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలనీ, కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించాలని వారు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలనీ, ఎన్ హెచ్ఎం ఎంప్లాయీస్, 2వ ఎఎన్ఎం, ఇసి ఎఎన్ఎం, అర్బన్ హెల్త్ సెంటర్స్ ఎఎన్ఎం, హెచ్ఆర్‌డి ఎఎన్ఎంలతో పాటు 104, 108, 102, ఆరోగ్య మిత్ర, టీశాక్స్, హాస్పిటల్ వర్కర్లు, టి హబ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, ఆయుష్ కాంట్రాక్ట్ ఉద్యోగులు తదితరులను పర్మినెంట్ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, సిపిఎస్ విధానం రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని తదితర 12 డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టారు.

దళిత యువకుడిపై దాడి

- నగ్నంగా నడిపించి దుర్భాషలాడుతూ కర్రలతో దాడి
- దాడి చేసింది ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ దుండగులే..
- అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- సిఐకి దళిత సంఘాల నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మతిస్థిమితం లేని దళిత యువకునిపై కొందరు దుండగులు విచక్షణారహితంగా దాడి చేశారు. నగ్నంగా నడిరోడ్డుపై నడిపించుకుంటూ.. జై శ్రీరాం అనే నినాదాలు చేస్తూ.. యువకునిపై దాడి చేశారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామ శివారు ఎల్లదాసునగర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. బేడ బుడగజంగాల (దళిత) సామాజిక తరగతికి చెందిన మతిస్థిమితం లేని ఊపిరి అజయ్‌కుమార్‌పై కొందరు దుండగులు విచక్షణారహితంగా దాడి చేశారు. రోడ్డుపై నగ్నంగా నడిపించుకుంటూ తీసుకెళ్తూ.. దుర్భాషలాడుతూ.. జై శ్రీరాం అనే నినాదాలు చేస్తూ.. యువకుడిపై దాడికి పాల్పడ్డారు.ఈ ఘటన గత మంగళవారం జరగ్గా.. సోషల్ మీడియాలో వీడియోలు చెక్కర్లు కొట్టడంతో వెలుగులోకి వచ్చింది.

ఆర్ఎస్ఎస్, బిజెపి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌కు సంబంధించిన దుండగులు ఈ దాడికి పాల్పడ్డారని, వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ ఎల్.శ్రీనుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ.. యువకున్ని కర్రలతో కొడుతూ అర్ధనగ్నంగా ఊరేగించి.. తాళ్లతో కాళ్లు, చేతులు కట్టి.. గుడి గోడకు కట్టేసి విపరీతంగా దాడి చేశారని తెలిపారు. దుండగలను తక్షణమే అరెస్టు చేసి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, అటెంప్ట్ మర్డర్ కేసు నమోదు చేసి శిక్షించాలని కోరారు. మతం పేరుతో భారత్ మాతాకీ జై అంటావా లేదా అని దళితుల మీద దాడి చేయడం అమానుషమన్నారు. ఇలాంటి ఘటనలు చేర్యాల ప్రాంతంలో జరగడం ఇదే మొదటిసారి అన్నారు. ఈ చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని, లేని యెడల దళిత సంఘాలుగా ఉద్యమిస్తామని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బక్కెల్లి బాలకిషన్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మల్లిగారి యాదగిరి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామగళ్ల నరేష్, ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సనవాల ప్రసాద్, అంబేద్కర్ సంఘం నాయకులు జేరిపోతుల పరుశరాములు, మల్లిగారి రాజు, షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి నాయకులు బుట్టి బిక్షపతి, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, పుట్ట రాజు, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు కొంద్ర మల్లేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మల్యాల శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు భూమిగారి మధుకర్, బిఆర్ఎస్‌వి ప్రేమ్ కుమార్, భూమిగారి దామోదర్ ఉన్నారు.



సిఐకి ఫిర్యాదు చేస్తున్న దళిత సంఘాల నాయకులు